**Namaste Telangana**

# కొత్తగా జిల్లా అటవీ అధికారి పోస్టు

- 16 సర్కిళ్లు, 48 డివిజన్లు
- అటవీ ఉన్నతాధికారులతో మంత్రి జోగు రామన్న సమీక్ష



అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి జోగు రామన్న

నమస్తే తెలంగాణ, హైదరాబాద్:

జిల్లాల పునర్విభజన నేపథ్యంలో పరిపాలనకు అనుకూలంగా అటవీ వ్యవస్థను సర్దుబాటు చేయాలని మంత్రి జోగు రామన్న ఆదేశించారు. మంగళవారం అరణ్యభవన్‌లో అటవీశాఖ ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్త జిల్లాల్లో అధికారుల విధులు, విధివిధానాలు, కొత్త పోస్టులు, పరిపాలనాపరమైన అంశాలు చర్చకు వచ్చాయి. ప్రస్తుతం అటవీ శాఖలో ఉన్న పోస్టులు, డివిజన్స్, రేంజ్‌ల సంఖ్యను గణనీయంగా పెంచాలని ప్రతిపాదించామని త్వరలోనే వీటిని ప్రభుత్వానికి పంపుతామని చెప్పారు. ఈ ప్రతిపాదనల్లో కొత్తగా జిల్లా అటవీ అధికారి పోస్టును ప్రత్యేకంగా సృష్టించాలన్న విషయం కూడా ఉందని తెలిపారు. ప్రతి జిల్లాలో నాలుగు వరకు ఫారెస్ట్ డివిజన్‌లను పెంచనున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్(డీఎఫ్‌వో)పోస్టును ఇకనుంచి ఫారెస్ట్ డివిజనల్ ఆఫీసర్(ఎఫ్‌డీవో)గా మార్చుతూ ప్రతిపాదించినట్లు మంత్రి చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రస్తుతం ఉన్న 22 డివిజన్‌లను 48కి పెంచాలని, ఐదు సర్కిళ్లను 16కు పెంచాలని సూచిస్తూ ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు వివరించారు. కొత్తగా ఐదు సీసీఎఫ్ పోస్టులను సృష్టించనున్నట్లు తెలిపారు. పన్నెండు సర్కిళ్లలో ఫ్లయింగ్ స్క్వాడ్ విభాగం సిబ్బంది ఉండేలా ప్రతిపాదించామన్నారు. ఎక్కువ సంఖ్యలో అటవీ రేంజ్‌లను ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు జోగు రామన్న తెలిపారు. సమీక్షా సమావేశంలో అటవీ శాఖ ముఖ్య కార్యదర్శి బీఆర్ మీనా, పీసీసీఎఫ్ ప్రశాంత్‌కుమార్ ఝా, అదనపు పీసీసీఎఫ్‌లు, సీఎఫ్‌లు పాల్గొన్నారు.